## వికారాబాద్ కలెక్టర్‌పై దాడి హేయనీయం

టీఎన్జీవో కేంద్రసంఘం ప్రధాన కార్యదర్శి ముజీబ్‌హుస్సేనీ

సుల్తాన్‌బజార్, నవంబర్ 11: విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై జరిగిన దాడి క్రూరమైన చర్య అని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్య క్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీలు సోమవారం తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో భాగంగా గ్రామానికి వెళ్ళిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డిలపై రైతుల పేరిట జరిపిన దాడిని ఎన్జీవోల సంఘం పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా సేవలో నిరంతరం కృషి చేసే ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన భాధ్యత ప్రభుత్వంపై ఉందని, దాడిపై ప్రభుత్వం తప్పకుండా చర్యలను తీసుకోవాలని వారు అన్నారు. ప్రజలకు ఎన్ని ఇబ్బందులున్నా వాటిని పరిష్కరించుకునే మార్గాలు ఉన్నాయని, చట్టాన్ని తమ చేతులలోకి తీసుకొని జిల్లా అత్యున్నత అధికారి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై, ఇతర అధికారులపై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. దాడులను తెలంగాణ ఎన్జీవోల సంఘం ఖండిస్తూ మంగళవారం వికారాబాద్ జిల్లాలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలను చేపడుతున్నట్లు వారు వివరించారు. దోషులు ఎంతటి వారైనా చట్ట పరిధిలో శిక్షలు విధించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటే శ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, వికారాబాద్ జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు శివ కుమార్, కార్యదర్శి అబ్దుల్ బాష పాల్గొన్నారు.

# ఫిర్యాదులిచ్చినా.. చర్యల్లేవ్

**ప్రజావాణిపై నగరంలో నిరాసక్త - సుదూర ప్రాంతాల ఫిర్యాదుదారులకు చుక్కెదురు**

సిటీబ్యూరో, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ ) : జీహెచ్ఎంసీ ప్రజావాణికి అర్జీదారుల నుంచి స్పందన కరువైంది. క్షేత్రస్థాయిలో పరిష్కారం కానివి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తే పరిష్కారం లభిస్తుందని ఎంతో ఆశతో సుదూర ప్రాంతాల నుంచి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారుడికి చుక్కెదురవుతున్నది. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి వారం తూతూ మంత్రంగా నిర్వహిస్తుండడం, ఫిర్యాదు చేసిన పరిష్కారానికి నోచుకోకపోవడంతో అర్జీదారులు రావడం లేదు. గత వారం తరహాలోనే సోమవారం 43 ఫిర్యాదులు మాత్రమే అధికారులు స్వీకరించారు. ఈ ఫిర్యాదులను సైతం ఆంక్షల నడుమ ఫిర్యాదులను స్వీకరించారు. నిర్బంధాలను దాటి అర్జీదారులు వెళ్లాల్సి వచ్చింది.. ముందుగా తన వెంట తెచ్చుకున్న సెల్‌ఫోన్, బ్యాగులు ముందు ఉన్న హోంగార్డు, సిబ్బందికి అందిస్తేనే వారి ఇచ్చిన టోకెన్ ద్వారా ప్రజావాణి కార్యక్రమంలోకి అనుమతి దక్కుతుంది.




ప్రజావాణిలో మేయర్, డిప్యూటీ మేయర్లకు ఫిర్యాదు చేస్తున్న అర్జీదారు

సమస్య తీవ్రత వివరించేందుకు సెల్‌ఫోన్‌ను అనుమతించాలని విజ్ఞప్తులు చేసినా.. అధికారులు పట్టించుకోకపోవడం లేదంటూ అర్జీదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను పరిశీలించి.. వెంట వెంటనే పరిష్కరించేలా చొరవ చూపాలని సంబంధిత అధికారులను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి నగరం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి మేయర్, డిప్యూటీ మేయర్ విజ్ఞప్తులను స్వీకరించారు.

## 163 ఆంక్షల సడలింపు

**సచివాలయానికి 500మీటర్లు**

సిటీబ్యూరో: నగరంలో నెల రోజుల పాటు విధించిన బీఎన్ఎస్ఎస్ 163 (144 సీఆర్‌పీసీ) ఆంక్షల్లో కొన్ని సడలింపులిస్తూ సోమవారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వు లు జారీ చేశారు. గత నెల 27న హైదరాబాద్ నగర వ్యాప్తంగా 144 సెక్షన్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీని పై నగర వాసుల నుంచి తీవ్ర విమర్శ లు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా నగర వ్యాప్తంగా ఉన్న ఆంక్షలను సడలించి కేవలం సచివాలయానికి 500 మీటర్ల పరిధిలోనే ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని తా జాగా, ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఆం క్షల నేపథ్యంలో సచివాలయం పరిస రాల్లో ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడటాన్ని, ఊరేగింపులు, ధర్నా లు, ర్యాలీలు, బహిరంగ సభలు, ప్ర సంగాలు, ప్లకార్డుల ప్రదర్శనలపై నిషేధం. ఈ ఆజ్ఞలు సోమవారం నుంచి అమల్లోకి వస్తాయని సీపీ తెలిపారు.

# మందకొడిగా సాగుతున్న సర్వే

**మూడు రోజుల్లో కేవలం 1,58,150 కుటుంబాల సర్వే పూర్తి**

**నిర్దేశిత లక్ష్యంలో 29 లక్షల కుటుంబాల సర్వే అనుమానమే..!**

సిటీబ్యూరో, నవంబరు 11(నమస్తే తెలంగాణ): ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మందకొడిగా సాగుతున్నది. సర్వే చేపట్టి మూడు రోజులు గడిచినా ఆ ప్రక్రియ గాడిన పడలేదు. ఎన్యూమరేటర్లకు అడుగడుగునా ప్రభుత్వ వ్యతిరేకత, సర్వేలో శాస్త్రీయత, సమగ్రత, చిత్తశుద్ధి లోపించిందని ప్రజలు చాలా చోట్ల సమాచారం ఇచ్చేందుకు విముఖత వ్యక్తం చేస్తుండటం వారికి తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలోనే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఇప్పటి వరకు 1,58,150 కుటుంబాల సర్వే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సర్వేకు మొత్తం 19,218 ఎన్యూమరేటర్లను నియమించగా, ఎలాంటి జాప్యం లేకుండా సర్వే నిర్వహణకు మూడు సర్కిళ్లకు ఒక సీనియర్ అధికారిని నోడల్ అధికారిగా నియమించారు. కాగా,



శనివారం సర్వే ప్రక్రియ ప్రారంభం కాగా, తొలిరోజు 12,912 కుటుంబాలు పూర్తి కాగా, ఆదివారం నాటికి 69,624 కుటుంబాలు, సోమవారం రోజున 88,516 కుటుంబాలలో సర్వే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. మూడు రోజుల వ్యవధిలో మొత్తం 1,58,150 కుటుంబాల సర్వే పూర్తి చేశారు.

## సుద్దాలకు సినారె-ఆళ్ళ స్వర్ణ కంకణం



సుద్దాల అశోక్ తేజను సత్కరించిన మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్ రావు, రమణాచారి తదితరులు

ముషీరాబాద్, నవంబర్ 11: వంశీ ఆర్ట్ థియేటర్స్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి ఆళ్ళ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో సినారె-ఆళ్ళ స్వర్ణ కంకణ ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ కవి డాక్టర్ సుద్దాల అశోక్ తేజకు సినారె - ఆళ్ల స్వర్ణ కంకణం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, సినీ దర్శకులు ఏ.కోదండ రామిరెడ్డి, బి.గోపాల్, శారద ఆకునూరి, వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, తేన్నేటి సుధాదేవి, శైలజ సుంకరపల్లి తదితరులు పాల్గొన్నారు.



## 50 వసంతాల ఎడారి పూలు డిజిటల్ పుస్తకం ఆవిష్కరణ

సిటీబ్యూరో, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): దివంగత కవి ఆస్కాని నరసింహా సాగర్ రచనలో రూపుదిద్దుకున్న '50 వసంతాల ఎడారి పూలు' డిజిటల్‌లో రూపొందించిన పుస్తకాన్ని ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ మీడియా అకాడమి తొలి చైర్మన్ అల్లం నారాయణ, టీఎస్‌పీఎస్సీ తొలి చైర్మన్ ఘంటా చక్రపాణి, సాహిత్య అకాడమీ పూర్వ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్‌తో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ, అప్పట్లో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక పరిస్థితులను తన గేయాల ద్వారా వివరించారని, కవి నరసింహ సాగర్ ఒక తెలుగు పండితుడు కావడంతో చదువు విషయంలో విద్యార్థులు అశ్రద్ధగా ఉంటే ఎలాంటి నష్టాలు జరుగుతా యో.. పుస్తకంలో చక్కగా గేయాల రూపంలో రచించారన్నారు. ఆధునిక తరానికి ఆ గేయాలను అందించాలన్న ఉద్దేశంతో దివంగత నరసింహసాగర్ కుటుంబ సభ్యులు డిజిటల్ పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, సీనియర్ జర్నలిస్టులు రమేశ్ హజారీ, వర్దెల్లి వెంకటేశ్వర్లు, రమణ కుమార్, యోగానంద్, శేఖర్‌తో పాటు కుటుంబ సభ్యులు ఆస్కాని శ్రీనివాస్ సాగర్, మారుతి సాగర్, కుసుమ గౌని సత్యనారాయణ, నీలవేణి బుచ్చన్న, శారద, సత్యనారాయణ పాల్గొన్నారు. వారి సొంత గ్రామమైన మహబూబ్‌నగర్ జిల్లా ముసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నరసింహస్వామి జ్ఞాపకార్థం డిజిటల్ లైబ్రరీకి రెండు కంప్యూటర్లను కుటుంబ సభ్యులు బహూకరించారు.

## దున్నపోతుపై వర్షం.. కాంగ్రెస్ ప్రభుత్వ తీరు

- నిరసనపై కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపేది?
- 53 రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోరా?
- ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఉద్యోగుల జేఏసీ
- అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్థలం కేటాయింపు వెనక్కి తీసుకోవాలని డిమాండ్

బంజారాహిల్స్, నవంబర్ 11: జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని జేఎన్ఎఫ్ఏయూకు కేటాయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 53 రోజులుగా తామంతా నిరసన కార్యక్రమాలు చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని, దున్నపోతుపై వర్షం పడ్డ చందంగా వ్యవహరిస్తోందని అంబేద్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి చైర్ పర్సన్ ప్రొ.పల్లవీ కాబ్డే అన్నారు. యూనివర్సిటీ ప్రాంగణంలో ఉద్యోగులంతా మధ్యాహ్న భోజనం సమయంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొ.పల్లవీ కాబ్డే మాట్లాడుతూ, దేశంలో ఉన్నత విద్యా వ్యవస్థలో ఓపెన్ యూనివర్సిటీలదే కీలకపాత్ర అని తెలంగాణ మేధావులు,విద్యావేత్తలు చెబుతుంటే రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు మాత్రం ఓపెన్ యూనివర్సిటీ మనుగడను దెబ్బతీసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ వర్సిటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని ఎవరికీ కేటాయించవద్దని తెలంగాణ మేధావులు సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారని, 53 రోజులుగా యూనివర్సిటీలో అన్ని వర్గాలకు చెందిన ఉద్యోగులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకోకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేసేలా కార్యాచరణ రూపొందించుకోనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ సెక్రటరీ జనరల్ వేణుగోపాల్‌రెడ్డి. నేతలు ప్రొ.జి.పుష్పా చక్రపాణి, ఎండీ. హబీబుద్దీన్.డా. అంబేద్కర్. ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఆవరణలో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

## ఎంఎల్‌హెచ్‌పీలను మెడికల్ ఆఫీసర్లుగా మార్చాలి

**యూనియన్ ప్రతినిధులు డాక్టర్ పుట్ట మహేందర్ రావు**

సుల్తాన్ బజార్, నవంబర్ 11: తెలంగాణ రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్‌లో 2020 నుంచి పల్లె దవాఖానలలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)లుగా విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారుల సమస్యలను పరిష్కరించాలని ఎంఎల్‌హెచ్‌పీ పల్లె దవాఖాన యూనియన్ ప్రతినిధులు డాక్టర్ పుట్ట మహేందర్ రావు, డాక్టర్ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కోఠిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2020 నుంచి పలు దఫాలుగా ఎంఎల్‌హెచ్‌పీ పల్లె దవాఖానలలో రిక్రూట్ అయిన వైద్యాధికారులను ఎటువంటి షరతులు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. త్వరలోనే యూనియన్ ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో దిశ దశ నిర్వహించడం జరుగుతుందన్నారు. పల్లె దవాఖాన వైద్యాధికారులకు సుప్రీం కోర్టు గైడ్ లైన్స్ ప్రకారం, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న వైద్యాధికారులకు ఇస్తున్న తరహాలో పల్లె దవాఖాన వైద్యాధికారులకు రూ.54 వేలను ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాలలో తరహాలోనే ఆయుష్మాన్ భారత్ మెడికల్ ఆఫీసర్‌గా తమను పరిగణించాలని అన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ నుంచి పీడీ ఎంవోగా పేరును మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యాధికారులు డాక్టర్ వెంకన్న, డాక్టర్ శివ శంకర్, డాక్టర్ లహర్ గాంధీ, డాక్టర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 30 సర్కిళ్లకు నోడల్ ఆఫీసర్లు!

**సర్వే సమర్థవంతానికి 10 మంది ఉన్నతాధికారులు**

సిటీబ్యూరో, నవంబరు 11(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి జీహెచ్ఎంసీ 30 సర్కిళ్లకు 10 మంది నోడల్ ఆఫీసర్లను నియమించింది. మూడు సర్కిళ్ల చొప్పున వీరికి బాధ్యతలను అప్పగించింది. కాప్రా, మల్కాజిగిరి, సికింద్రాబాద్‌కు అడిషనల్ కమిషనర్ సరోజ, హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్‌కు అడిషనల్ కమిషనర్ ఎస్.పంకజ, సంతోష్ నగర్, చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా అడిషనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్, మలక్‌పేట, చార్మినార్, రాజేంద్రనగర్ ఎస్టేట్ ఆఫీసర్ వై.శ్రీనివాస్ రెడ్డి, మెహిదీపట్నం, కార్వాన్, జూబ్లీహిల్స్‌కు ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ శరత్‌చంద్ర, గోషామహల్, ముషీరాబాద్, అంబర్‌పేటకు అడిషనల్ కమిషనర్ కె.సత్యనారాయణ, యూసుఫ్‌గూడ, శేరిలింగంపల్లి, చందానగర్ చీఫ్ ఎగ్జామినర్ అకౌంట్స్ వెంకట్ రెడ్డి, పటాన్ చెరువు, మూసాపేట, కూకట్‌పల్లికి అదనపు కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, కుత్బుల్లాపూర్, గాజుల రామారం అడిషనల్ కమిషనర్ శానిటేషన్ రఘుప్రసాద్, అల్వాల్, బేగంపేట, సికింద్రాబాద్ కంటోన్మెంట్, ఉప్పల్ అడిషనల్ కమిషనర్ యాదగిరి రావులను నియమించారు. ఈ నియమకాలు, సర్వే నిర్వహణను వేగవంతం చేయడం, సమాచార సేకరణను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా ఉంటుందని అధికారులు తెలిపారు.

## 15 నుంచి స్టాంపులు, నాణేలు, కాగితపు కరెన్సీ ప్రదర్శన



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సాగి శ్రీనివాస రాజు

హిమాయత్‌నగర్, నవంబర్ 11: నాటి చరిత్ర, పురాతన అంశాలు, పూర్వీకుల జీవన విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు రెడ్డి హిల్స్‌లోని ఎఫ్టీసీసీఐలో తపాలా స్టాంపులు, నాణేలు, కాగితపు కరెన్సీ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ది హైదరాబాద్ ఫిలాటెలిక్ అండ్ హాబీస్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి సాగి శ్రీనివాస రాజు తెలిపారు. ఆ ప్రదర్శనకు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరణ హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1962లో ఏర్పడిన ఈ సంస్థ అత్యంత ప్రజాదరణ పొందిన స్టాంపులు, నాణేలను సేకరించి అభిరుచి కలిగిన ఎంతో మందిని ఒక వేదిక మీదకు తీసుకురావడం జరుగుతుందన్నారు. వివిధ కాలంలో చలామణిలో ఉన్న నాణేలు దేనికదే వైవిధ్యంగా నిలిచాయని, కాకతీయులు, శ్రీకృష్ణ దేవరాయలు, నిజాం కాలంలో విడుదలైన స్టాంపులు నాణేలను సైతం ఈ ప్రదర్శనలో ఉంటాయని చెప్పారు. ఎఫ్టీసీసీఐ ప్రతినిధి సురేశ్ కుమార్ సింఘాల్, జీపీవో చీఫ్ పోస్ట్ మాస్టర్ వై.ప్రసాద్ హాజరై ఈ ప్రదర్శనను ప్రారం భిస్తారని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనకు ప్రజలు అధిక సంఖ్యల్లో తరలివచ్చి సందర్శించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సొసైటీ సభ్యులు లఖోటియా, ఎస్.శ్రీకాంత్, బి.సంతోష్ రెడ్డి, మణి కిరణ్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

# అర్బన్ పార్క్‌ల ఏర్పాటు.. ఇంకెప్పుడు?

**బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు వెచ్చించినా ప్రారంభం కాని పనులు**

మేడ్చల్, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): అర్బన్ పార్క్‌ల ఏర్పాటులో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని అటవీ శాఖ భూములలో ప్రజలకు సౌకర్యంగా ఉండి అందుబాటులో ఉన్న ప్రాంతాలలో ఆరు అర్బన్ పార్క్‌ల ఏర్పాటుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించి నిధులను మంజూరు చేసింది. అయితే, అటవీ శాఖ భూములలో ఇప్పటి వరకు ప్రతిపాదించిన అర్బన్ పార్క్‌ల ఏర్పాటుకు పనులు ప్రారంభానికి నోచుకోలేదు. హైదరాబాద్ మహా నగరంలో ప్రజలు సేద తీరేలా ఆహ్లాదమైన వాతావారం పర్యావరణ పరిరక్షణకు అర్బన్ పార్క్‌లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అర్బన్ పార్క్‌ల ఏర్పాటుకు రూ.6 కోట్ల నిధులు మంజూరైన పనులు ప్రారంభించక పోవడంతో అర్బన్ పార్క్‌ల ఏర్పాటుపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 17 పార్క్‌ల అభివృద్ధి**

పర్యావరణ పరిరక్షణకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగానే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఉన్న 8,072,46 హెక్టార్ల విస్తీర్ణం ఉండగా, 40 ఫారెస్ట్ బ్లాక్‌లు ఉన్నాయి. అటవీ శాఖకు చెందిన భూమిలో పచ్చదనాన్ని పెంపొందించేలా బీఆర్ఎస్ ప్రభుత్వం అర్బన్ పార్క్‌లను ఏర్పాటు చేసి వాటిని తీర్చిదిద్దింది. జిల్లాలోని అటవీ శాఖ భూములలో భాగ్యనగరం నందనవనం (నారపల్లి) 461 ఎకరాలు, జటాయువు పార్క్(మేడిపల్లి) 134 ఎకరాలు, శాంతివనం(మేడిపల్లి)134 ఎకరాలు, ప్రశాంతివనం(దూలపల్లి) 741 ఎకరాలు, అక్సిజోన్ పార్క్(దూలపల్లి) 123 ఎకరాలు, ఆయూష్ వనం(బాహాదూర్‌పల్లి) 49.42 ఎకరాలు, అక్సిజన్ పార్క్(కండ్లకోయ) 70.39 ఎకరాలు, ఆరోగ్యవనం పార్క్(నాగారం) 44.48 ఎకరాలు, దర్మారం(ఉప్పర్‌పల్లి) 664.85 ఎకరాలు, ప్రాణ వాయువు పార్క్ (గాజుల రామారం) 148,26 ఎకరాలు, కీసర పార్క్(కీసర) 49,42 ఎకరాలు తుర్కపల్లి పార్క్(తుర్కపల్లి) 133 ఎకరాలు, కొండగొర్రె పార్క్(లాల్‌గడి మలక్‌పేట్) 26 ఎకరాలు, వెదురువనం(తూకుంట) 94 ఎకరాలు, ఎల్లంపేట్(ఎల్లంపేట్) 12 ఎకరాలు, యాద్గార్‌పల్లి పార్క్(యాద్గార్‌పల్లి)547.30 ఎకరాలు, గౌడవెల్లి పార్క్ (గౌడవెల్లి) 16 ఎకరాలలో అర్బన్ పార్క్‌లు అభివృద్ధి జరిగాయి.




మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కండ్లకోయ ఆక్సిజన్ పార్క్

## తాను మరణించినా.. ముగ్గురికి చేయూత



సంగిశెట్టి భాస్కర్ (ఫైల్)

ఖైరతాబాద్, నవంబర్ 11: తాను మరణించినా పలువురు జీవితాల్లో వెలుగులు నింపాడు 47 ఏండ్ల సంగిశెట్టి భాస్కర్. నల్గొండ జిల్లా చిట్యాల మండలం విద్యానగర్‌కు చెందిన భాస్కర్ ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 7న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, అతన్ని ఓ ప్రైవేట్ దవాఖనలో చేర్పించి చికిత్స అందిస్తుండగా, 9న బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టతను వారికి వివరించగా, అందుకు వారు అంగీకరించారు. భాస్కర్ శరీరం నుంచి కాలేయం, రెండు మూత్ర పిండాలను సేకరించినట్లు నిమ్స్ జీవన్‌దాన్ నోడల్ అధికారి ప్రొఫెసర్ డాక్టర్ శ్రీభూషణ్ రాజు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివ కుమార్

## లింగాయత్‌లు అన్ని రంగాల్లో వృద్ధి చెందాలి

**తెలంగాణ వీరశైవ లింగాయత్ ఫెడరేషన్**

ఖైరతాబాద్, నవంబర్ 11: లింగాయత్‌లు ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని తెలంగాణ వీరశైవ లింగాయత్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బెడకన హనుమంతు, మల్కాపురం శివ కుమార్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, రాష్ట్రంలోని హైదరాబాద్, రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్, మెదక్, కరీంనగర్, నల్గొండ తదితర జిల్లాల్లో సుమారు 40 లక్షల వరకు జనాభా ఉన్నా సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందడం లేదన్నారు. సరైన జనాభా గణన లేకపోవడంతో లింగాయత్‌లు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈసారి ప్రభుత్వం చేపడుతున్న కులగణనలో వీర శైవ లింగాయత్, లింగబలిజగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో తెలంగాణ వీర శైవ లింగాయత్ ఫెడరేషన్ వైస్ చైర్మన్ ఎం.వీరమల్లేశ్, ఉపాధ్యక్షులు గౌరీ శంకర్, యువజన అధ్యక్షులు ఆలూరె ఈశ్వర్ ప్రసాద్, కోట గుండప్ప, శ్రీనివాస్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజుల హామీలు అమలు చేయండి

**ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం**

ఖైరతాబాద్, నవంబర్ 11: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం కోరారు. ఈ నెల 21న ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాలు, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ పోస్టర్లను సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. మల్లేశం మాట్లాడుతూ, గడిచిన పదేండ్లలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోకాపేటలో సుమారు రూ.300 కోట్ల విలువైన ఐదెకరాల స్థలం, రూ.5 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. మత్సకారులకు వెయ్యి కోట్ల బడ్జెట్, 75 శాతం సబ్సిడీతో వివిధ పథకాలు మంజూరు, జీవో నం.4 ద్వారా ముదిరాజ్ అనే పదాన్ని మత్స్యకారులుగా మార్చడం, రూ.300 కోట్లతో 63 వేల ద్విచక్ర వాహన యూనిట్లు మంజూరు, రూ.150 కోట్లతో 3,200 మందికి మినీ వాహనాలు మంజూరు, 18 ఏండ్లు నిండిన ప్రతి ముదిరాజ్ బిడ్డకు మత్స్యశాఖ సభ్యత్వం కల్పించే విధంగా ఆదేశాలు, ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతి సంవత్సరం ఉచితంగా చేప పిల్లలు, రొయ్యల పంపిణీ, అందుకు కోసం రూ.500 కోట్ల మంజూరు, జీవో నం. 268 ద్వారా పంచాయతీ చెరువుల మత్స్య శాఖకు బదలాయింపు, రూ.75 కోట్లతో మత్స్యకారులకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం లాంటి పనులు చేశారన్నారు. ప్రస్తుత, కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం అంటూ అనే హామీ ఇచ్చారని, కులగణన సక్రమంగా చేపట్టడంతో పాటు 42 శాతం రిజర్వేషన్లలో ముదిరాజుల వాటా జనాభాకు అనుగుణంగా ఇవ్వాలన్నారు. జీవో నం.15 ప్రకారం, ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముదిరాజ్ కో ఆపరేటీవ్ సొసైటీస్ కార్పొరేషన్‌కు వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలన్నారు. అలాగే, తెలంగాణ మత్స్య శాఖ ఫెడరేషన్‌కు వెంటనే ఎన్నికలు జరిపి చైర్మన్, పాలక మండలిని నియమించాలన్నారు. సమావేశంలో మహిళా అధ్యక్షురాలు మందుల వరలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బల్ల సత్తయ్య, యువజన అధ్యక్షులు పండుగ బాలు, బి.యాదగిరి, కృపాసాగర్, కనకమ్మ, శ్రీనివాస్, ఉషా ముదిరాజ్, చెరుకు సాంబరాజ్, రమేశ్ ముదిరాజ్ పాల్గొన్నారు.



దశాబ్ది ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మల్లేశం, మందుల వరలక్ష్మి, బల్ల సత్తయ్య, పండుగ బాలు





సికింద్రాబాద్‌లో గురునానక్ 555వ జయంత్యుత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. సిక్కు మతస్థులు చిన్నా పెద్ద అంతా కీర్తనలు ఆలపిస్తూ, విన్యాసాలు చేస్తూ పెద్ద ఎత్తున ఉత్సవ ర్యాలీ తీశారు.

